సాక్షి
నిజామాబాద్

శనివారం, 4, మార్చి, 2023



కొనసాగుతున్న పోలీస్ క్రీడలు

పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో పరేడ్ గ్రౌండ్‌లో పోలీసులకు క్రీడలు కొనసాగుతున్నాయని సీపీ నాగరాజు పేర్కొన్నారు.

- 8లో ▸



చెస్ క్రీడాకారుల ఎంపిక

వర్సిటీ ఆధ్వర్యంలో చెస్ క్రీడాకారులను ఎంపిక చేసినట్లు వర్సిటీ క్రీడా విభాగం డైరెక్టర్ సంపత్ పేర్కొన్నారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
35.9 /20.8

వాతావరణం

ఉదయం నుంచే ఎండ తీవ్రత పెరుగుతుంది. మధ్యాహ్నం ఉక్కపోతగా ఉంటుంది. సాయంత్రం చల్లటి గాలులు వీస్తాయి. రాత్రి చలిగా ఉంటుంది.

న్యూస్‌రీల్

సొసైటీ డైరెక్టర్ సంతకం ఫోర్జరీ

- కలెక్టర్‌కు, పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు

నిజామాబాద్ సిటీ : నిజామాబాద్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్‌పై ప్రవేశపెట్టిన తీర్మాన పత్రంలో డైరెక్టర్ సంతకాన్ని ఫోర్జరీ చేశారని, చర్యలు తీసుకోవాలని కోరుతూ ఇన్‌చార్జి చైర్మన్ రవీందర్ శుక్రవారం కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, డీసీవో కార్యాలయంలో లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. సొసైటీ పాలకవర్గంలో కొందరు డైరెక్టర్లు నాపై కక్ష సాధింపు చర్యల్లో భాగంగా గతనెల ఫిబ్రవరి 17న అవిశ్వాసం తీర్మానం ప్రవేశపెట్టేందుకు తనకు లెటర్ ఇవ్వగా అందులో రూరల్ మండలం గొల్లగుట్ట తండాకు చెందిన సొసైటీ డైరెక్టర్ మాలవత్ ఫకీరా సంతకం పెట్టకున్నా పెట్టినట్లు సంతకాన్ని ఫోర్జరీ చేశారని, ఫోర్జరీ చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఆయన పేర్కొన్నారు. అనంతరం ఇన్‌చార్జి చైర్మన్, డైరెక్టర్ ఫకీరాలు నాల్గోటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫోర్జరీ సంతకంపై ఫిర్యాదు చేశారు.

రుణాల మంజూరులో భీమ్‌గల్‌కు మొదటిస్థానం



భీమ్‌గల్ : మహిళా సంఘాలకు రుణాల మంజూరులో ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాన్ని భీమ్‌గల్ మండల సమాఖ్య పూర్తిచేసి జిల్లాలోనే మొదటిస్థానంలో నిలిచిందని డీఆర్‌డీవో చందర్‌నాయక్ పేర్కొన్నారు. రుణాల మంజూరులో రూ. 45.40 కోట్లతో 101.90 శాతం లక్ష్యాన్ని వారు అందుకున్నారన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో మహిళా సంఘాల ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. ఏపీఎం కుంట శ్రీనివాస్, సీసీలను డీఆర్‌డీవో చందర్ నాయక్ అభినందించారు. అదనపు డీఆర్‌డీవో మధుసూదన్, ఎంపీడీవో రాజేశ్వర్, డీపీఎంఎల్ బీఎల్ నీలిమ, సీసీ నరేశ్, రఘుపతి, గంగ సాయిలు పాల్గొన్నారు.

గోపాలమిత్ర పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

- ఉమ్మడి జిల్లాలో 16 పోస్టులు ఖాళీ


ఇందూరు(నిజామాబాద్ అర్బన్) : ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఖాళీగా ఉన్న 16 గోపాల మిత్ర పోస్టులను భర్తీ చేయడానికి అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా పశు గణాభివృద్ధి సంఘం సీఈవో శ్రీధర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకునే వారు పదో తరగతి విద్యార్హత కలిగి గోపాల మిత్ర సేవా కేంద్రానికి 3–5 కిమీ పరిధిలోని గ్రామానికి చెందిన వారై ఉండాలన్నారు. దరఖాస్తును సంబంధిత మండల పశువైద్యాధికారి అలాగే సర్పంచ్ ద్వారా ధ్రువీకరించి ఈ నెల 9వ తేదీలోగా జిల్లా పశు గణాభివృద్ధి సంఘంలో సమర్పించాలన్నారు. ఈ నియామకాలు ప్రభుత్వ ఉద్యోగాలు కావని, స్వయం ఉపాధి నిమిత్తమేనని స్పష్టం చేశారు. జక్రాన్‌పల్లి మండలంలో తొర్లికొండ, డిచ్‌పల్లి మండలంలో సుద్దపల్లి,మిట్టాపల్లి, భీమ్‌గల్ మండలంలో చేంగల్, నందిపేట్‌లో జిజినడ్కుడ, బోధన్‌లో అచన్‌పల్లి, మోపాల్‌లో బాడ్సి, వర్నిలో హుమ్నాపూర్, సిరికొండలో కొండాపూర్, పందిమడుగు, మోర్తాడ్‌లో సుంకెట్, ఏర్గట్లలో దోంచంద. అలాగే కామారెడ్డి జిల్లాలో భిక్కనూరు మండలంలోని తిప్పాపూర్, బస్వాపూర్, పెద్ద కొడప్‌గల్‌లో శివపూర్, రామారెడ్డిలో పోసానిపేట్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

మంచిప్పలో ఎలుగుబంటి సంచారం

మోపాల్ : మండలంలోని మంచిప్ప పరిసరాల్లో ఎలుగుబంటి సంచరిస్తోంది. ఇటీవల పంటపొలాల్లోని రైతులు ఎలుగుబంటి కనిపించడంతో భయభ్రాంతులకు గురవుతున్నారు. ఈ విషయాన్ని ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ సుధీర్‌కు సమాచారం ఇవ్వడంతో వారు ఆనవాళ్లు గుర్తించారు. రాత్రివేళల్లో పంటపొలాలకు వెళ్లే రైతులు తప్పనిసరిగా టార్చ్‌లైట్‌ను తీసుకెళ్లాలని వారు సూచిస్తున్నారు. మంచిప్ప అటవీ ప్రాంతంలో ఎలుగుబంట్లు సంచరిస్తుండడంతో గ్రామస్తులతోపాటు, తండావాసులు భయభ్రాంతులకు గురవుతున్నారు.

‘ప్రవేశ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి’

భిక్కనూరు: ఇంటర్ ప్రథమ సంవత్సరం ప్రవేశాలకు భిక్కనూరు గురుకుల కళాశాలలోని పరీక్ష కేంద్రంలో ఆదివారం సీవోఈ సెట్ కోసం ఏర్పాట్లు పూర్తి చేశామని కళాశాల ప్రిన్సిపాల్ నర్సింహారెడ్డి తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు. విద్యార్థులు అరగంట ముందే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలన్నారు.



వైద్య పోస్టుల్లోనూ అవినీతి..!

వైద్యారోగ్యశాఖలో అవినీతి ప్రకంపనలు కొనసాగుతూనే ఉన్నాయి. అద్దె కార్ల బిల్లుల చెల్లింపుల్లో అక్రమాలపై ఇప్పటికే శాఖ అభాసుపాలు కాగా, 2022లో వైద్యుల నియామకాల్లోనూ నిబంధనలకు నీళ్లొదిలినట్లు తాజాగా వెల్లడైంది. నియామకాల్లో సొంతవాళ్లను అందలం ఎక్కించిన విషయం బహిర్గతమైంది.

- ఇదీ జిల్లా వైద్యారోగ్య శాఖ విభాగం తీరు..
- డీఎంహెచ్‌వో కుమార్తెకు పోస్టింగ్ కోసం నిబంధనల ఉల్లంఘన
- ఆర్‌టీఐ కింద దరఖాస్తు చేసినా సమాచారమివ్వని వైనం

నిబంధనలివి..

2022 ఫిబ్రవరి 24వ తేదీన డీఎంహెచ్‌వో ఆధ్వర్యంలో వైద్యుల పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చారు. 14 మెడికల్ ఆఫీసర్ పోస్టులు, ఒక సైకియాట్రిస్ట్, ఒక సైకోథెరపిస్ట్, ఒక ఫిజీషియన్ పోస్టులు మొత్తంగా 17 వైద్యుల పోస్టులకు సంబంధించి నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈ నియామకాల్లో 1975 ప్రెసిడెన్షియల్ ఆర్డర్ ప్రకారం ఉన్న నిబంధనలను పాటించలేదు. అదేవిధంగా రూల్ 22 తెలంగాణ స్టేట్ సబార్డినేట్ రూల్స్‌ను సైతం బేఖాతరు చేసినట్లు పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో అడుగడుగునా అవకతవకలే కనిపిస్తున్నాయి. శాఖలోని వివిధ విభాగాల్లో అద్దె ప్రాతిపదికన ఉద్యోగులే వాహనాలు పెట్టుకున్నారు. దీనిపై కలెక్టర్ సీరియస్ అయినప్పటికీ ఈ వ్యవహారాన్ని కప్పిపుచ్చేందుకు కూడా మరిన్ని అక్రమాలకు ఉద్యోగులు పాల్పడుతుండడం గమనార్హం. మరోవైపు చనిపోయిన ఉద్యోగికి సంబంధించిన సదరు కుటుంబ సభ్యులకు పింఛను, బెనిఫిట్స్ ఇవ్వకపోగా, ఆ ఉద్యోగి సర్వీస్ రికార్డు పుస్తకం మాయం చేయడం చోటుచేసుకుంది. ఈ విషయమై కలెక్టర్ ఆదేశాల మేరకు డీఎంహెచ్‌వో సుదర్శనంపై రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఇదిలా ఉండగా గతేడాది వైద్యుల నియా మకం విషయంలో కూడా పలు అవకతవకలు చోటుచేసుకున్నట్లు సమాచార హక్కు చట్టం ద్వారా తీసుకున్న సమాచారంలో వెలుగుచూసింది. 2022 ఫిబ్రవరి 24వ తేదీన ఇచ్చిన నోటిఫికేషన్ కింద డీఎంహెచ్‌వో ఆధ్వర్యంలో వైద్యుల నియామకం చేశారు. నిబంధనల ప్రకారం దగ్గరి బంధువులను, రాష్ట్ర ప్రభుత్వం అనుమతి లేకుండా నియమించకూడదు. అయితే వీటిని తుంగలో తొక్కారు. ఓపెన్ కేటగిరి కింద డీఎంహెచ్‌వో కుమార్తె ఎం.సుష్మను నేరుగా నియామకం చేసుకున్నారు. ఈమెను నాన్ లోకల్ కేటగిరీ నుంచి తీసుకున్నారు. అయితే ఎంపికైన వారికి సంబంధించి రోస్టర్, బోనోఫైడ్ పత్రాలు, జిల్లా, జోన్ గురించిన వివరాలు లేవు. సమాచార హక్కు చట్టం కింద ఇచ్చిన దాంట్లో సుష్మకు సంబంధించిన ఈ వివరాల కాలమ్స్‌లో ఖాళీలు వదిలేశారు. పూర్తిస్థాయి సమాచారం ఇవ్వకుండానే సమాచార హక్కు చట్టం విషయంలోనూ గుట్టుగా వ్యవహరించడం గమనార్హం. ఇదేవిధంగా మరో ఉద్యోగి కుమార్తెను కూడా డీఎంహెచ్‌వో నిబంధనలకు విరుద్ధంగా నియామకం చేసినట్లు తెలుస్తోంది. ఈ విషయాలపై కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతును వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఫోన్‌కు స్పందించలేదు.

తప్పు మీద తప్పు చేస్తూ..

- వైద్యారోగ్యశాఖ ఉద్యోగుల పాట్లు
- పాత తేదీ బాండ్ పేపర్‌తో కప్పిపుచ్చేందుకు ప్రయత్నాలు

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : జిల్లా మెడికల్ అండ్ హెల్త్ విభాగంలో ఉద్యోగులే బినామీ పేర్లతో అద్దె ప్రాతిపదికన వాహనాలు ఏర్పాటు చేసుకున్న విషయమై ‘సాక్షి’లో వరుస కథనాలు వస్తున్న నేపథ్యంలో అక్రమాలను కప్పిపుచ్చుకునేందుకు సదరు ఉద్యోగులు వరుసగా మరిన్ని తప్పులు చేస్తున్నారు. ఓ ఉద్యోగి తన పేరిట ఉన్న కారును మరొకరికి అమ్మకం చేసినట్లుగా చూపేందుకు వీలుగా పాత తేదీ మీద ఉన్న బాండ్ పేపర్‌ను అక్రమ మార్గంలో కొనుగోలు చేసి ఉత్తుత్తి అగ్రిమెంట్ తయారు చేసినట్లు తెలిసింది. ఆఘమేఘాల మీద శుక్రవారం ఈ ప్రక్రియ పూర్తి చేసినట్లు సమాచారం. కాగా సదరు ఉద్యోగి కుటుంబ సభ్యుల పేరిట మరో రెండు వాహనాలు అద్దె ప్రాతిపదికన ఉన్నాయి. కక్కుర్తి వ్యవహారాలకు పాల్పడడమే కాకుండా వాటిని కప్పిపుచ్చుకునేందుకు వరుసగా మళ్లీ అక్రమ మార్గాలు ఎంచుకోవడం గమనార్హం. ఈ విషయమై కలెక్టర్ పూర్తి విచారణ చేయిస్తే వరుస అక్రమాల కథ తేలుతుందని పలువురు చెబుతున్నారు. కాగా ఇప్పటికే కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు డీఎంహెచ్‌వో సుదర్శనంను పిలిపించి సీరియస్ అయ్యారు. ఉద్యోగుల, వారి బంధువుల వాహనాలు తీసేయాలని ఆదేశించారు. అయినప్పటికీ పద్ధతి మార్చుకోకపోగా కలెక్టర్‌ను తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నాలు చేస్తుండడం విశేషం. బాధ్యతగా వ్యవహరించాల్సిన జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారే ఇలా అక్రమార్కులను ప్రోత్సహిస్తుండడం పట్ల తీవ్ర విమర్శలు వస్తున్నాయి.

సీబీసీఐడీతో విచారణ జరపాలి

ఖలీల్‌వాడి : జిల్లా వైద్యారోగ్య శాఖ జరుగుతున్న అవినీతి అక్రమాలపై సీబీసీఐడీతో విచారణ జరపాలని కాంగ్రెస్ రాష్ట్ర మైనారిటీ సెల్ నాయకులు సయ్యద్ కైసర్ డిమాండ్ చేశారు. శుక్రవారం కలెక్టరేట్ ఏవో ప్రశాంత్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ డీఎంహెచ్‌వో అవినీతికి కేరాఫ్ అడ్రస్‌గా మారిందన్నారు. రూ. కోట్లల్లో అవినీతి జరుగుతున్నా ఉన్నతాధికారులు పట్టించుకోవట్లేదని, అలాగే డీఎంహెచ్‌వోలోని ఉద్యోగులు ఆర్‌బీఎస్‌కెలో వాహనాలను అద్దెకు పెట్టుకున్నారన్నారు. డీఎంహెచ్‌వోలో వాహనం పెట్టిన సమీర్‌కు డబ్బులు చెల్లించాలన్నారు.



న్యాల్‌కల్‌కు వెళ్లే దారిలో ఇరిగేషన్ శాఖ స్థలంలో సాగవుతున్న వరిపంట

కబ్జా చేసి.. పొలం వేసి

- పర్యవేక్షణ చేయని ఇరిగేషన్ అధికారులు
- అక్రమార్కుల గుప్పిట్లో రూ. లక్షల విలువ చేసే స్థలాలు
- మామూళ్ల మత్తులో పట్టించుకోవట్లేదనే ఆరోపణలు

నిజామాబాద్‌నాగారం : ఖాళీ జాగా కనిపిస్తే కబ్జా చేసేందుకు అక్రమార్కులు సిద్ధమైపోతున్నారు. కబ్జా చేసేందుకు నగర శివారు.. నడిబొడ్డున అని కాకుండా ఎక్కడపడితే అక్కడ ఖాళీ జాగాలు కనిపిస్తే చాలు సంబంధిత అధికారులను గుప్పిట్లో పెట్టుకుని కబ్జాపర్వం నడిపిస్తున్నారు. నగరం పరిధిలోని నిజాంసాగర్ ప్రధాన కాలువకు ఇరువైపులా ఆక్రమణలు చోటు చేసుకున్నాయి. నిజాంసాగర్ ప్రధాన కాలువ పరిధిలోని న్యాల్‌కల్ గ్రామానికి వెళ్లే దారిలో ఇరిగేషన్‌శాఖకు స్థలాలున్నాయి. అందులో సుమారు రూ. 50లక్షలకు పైగా విలువైన జాగాలో ప్రస్తుతం వరి సాగవుతోంది. ఏళ్ల తరబడిగా ఈ తతంగం నడుస్తున్నా ఇరిగేషన్ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని విమర్శలు వస్తున్నాయి.

కంచె లేదు.. బోర్డుల్లేవు..

నిబంధనల ప్రకారం సంబంధిత అధికారులు ఇరిగేషన్ భూములు కబ్జాకు కాకుండా ఎప్పటికప్పుడు నిఘా ఏర్పాటు చేసుకోవాలి. అవసరమైతే కంచెలు ఏర్పాటు చేసి భూములను రక్షించాలి. సైన్‌బోర్డులు ఏర్పాటు చేయాలి. భూముల ధరలకు రెక్కలొస్తున్న వేళ అక్రమార్కుల కళ్లు ఈ స్థలాలపై పడడంతో దర్జాగా కబ్జా చేసేస్తున్నారు.

150 ఫీట్ల మేరకు..

కొన్నేళ్లుగా నిజాంసాగర్ ప్రధాన కాలువకు ఇరువైపులా కబ్జాల పరంపర కొనసాగుతూనే ఉంది. ఈ విషయం ఇరిగేషన్ అధికారులకు తెలిసినా పర్యవేక్షణ చేయట్లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రధాన కాలువకు ఇరువైపులా 150 ఫీట్ల మేర ఇరిగేషన్ శాఖకు స్థలాలున్నాయి. ఈ విస్తీర్ణంలో ఎలాంటి అక్రమ కట్టడాలు, కబ్జాలు చేయవద్దు. ఒకవేళ కబ్జాకు గురైనట్లు తెలిస్తే వెంటనే కబ్జాదారులపై చర్యలు తీసుకుని ఇరిగేషన్ ఆధీనంలోకి తీసుకోవాలి. కాని కబ్జా స్థలాల్లో ఏకంగా పంటలే పండుతున్నాయంటే సంబంధిత శాఖాధికారులు ఎంత మొద్దునిద్రలో ఉన్నారో అర్థం చేసుకోవచ్చు.

భూములను స్వాధీనపర్చుకుంటాం

ఇరిగేషన్‌కు సంబంధించిన భూములు కబ్జా చేయవద్దు. ఒకవేళ చేసినట్లు మా దృష్టికొస్తే కచ్చితంగా స్వాధీన పర్చుకుంటాం. నిజాంసాగర్ ప్రధాన కాలువ వెంబడి ప్రత్యేకంగా పర్యవేక్షణ చేసి కబ్జాలపై చర్యలు తీసుకుంటాం.

– బలరాం, డీఈ ఇరిగేషన్ శాఖ

రాష్ట్ర మైనారిటీ కమిషన్ చైర్మన్‌గా తారిక్ అన్సారీ

- ఉద్యమకారుడికి దక్కిన నామినేటెడ్ పదవి



నిజామాబాద్ నాగారం : జిల్లాకు చెందిన మైనారిటీ నాయకులు, బీఆర్‌ఎస్‌లో ఉద్యమ నాయకుడిగా కొనసాగిన తారిక్ అన్సారీకి నామినేట్ పోస్టు దక్కింది. రాష్ట్ర మైనారిటీ కమిషన్ చైర్మన్‌గా తారిక్‌అన్సారీని సీఎం కేసీఆర్ నియమించారు. ఇందుకు సంబంధించిన జీవోకూడా విడుదలైంది. కమిషనర్ చైర్మన్‌గా మూడేళ్లపాటు పదవిలో ఉండనున్నారు. అయితే తెలంగాణ ఉద్యమంలో తారిక్ అన్సారీ చురుకుగా పాల్గొన్నారు. బీఆర్‌ఎస్‌లో కొనసాగుతూ పార్టీ ఆవిర్భావం నుంచి సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు పనిచేశారు. బీఆర్‌ఎస్ మైనారిటీ సెల్ నాయకులుగా, జిల్లా మైనారిటీ అధ్యక్షుడిగా పనిచేశారు. ప్రస్తుతం పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా కొనసాగుతున్నారు.

జోరు మీదున్న జొన్న..

- ముళ్లజొన్న క్వింటాలుకు రూ. 5 వేల ధర
- తెల్ల, ఎర్రజొన్నలకు కూడా రూ. 4 వేల వరకు..
- కోతదశలో రేటు పెంచిన వ్యాపారులు
- మొదట్లో తక్కువ ధరకు ఒప్పుకున్న రైతులకు నష్టాలే..



మోర్తాడ్(బాల్కొండ): గడ్డి విత్తనాలకు సంబంధించిన జొన్నలకు ధర పెంచడానికి నాన్చుడు ధోరణి అవలంభించిన వ్యాపారులు తాజాగా రూటు మార్చారు. ఎర్రజొన్నలు, తెల్ల, ముళ్ల జొన్నలను కొనడానికి నిన్న మొన్నటి వరకు తక్కువ ధరకు ఒప్పందం చేసుకున్న వ్యాపారులు ఇప్పుడు ధర పెంచుతూ పోతుండటం విశేషం. సాగు విస్తీర్ణం తగ్గడం.. ఇతర రాష్ట్రాల్లో డిమాండ్ కారణంగా ముళ్ల జొన్నలను క్వింటాలుకు రూ. 5 వేలు చెల్లించి కొనుగోలు చేయడానికి సీడ్ వ్యాపారులు ధర్పల్లి మండలం మైలారం రైతులతో ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ సీజనులో ఇదే ధర అధికం అని రైతులు చెబుతున్నారు. వ్యాపారుల ధోరణి పరిశీలిస్తే జొన్నలకు క్వింటాలుకు రూ. 6 వేల వరకు ధర పెంచే అవకాశముందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

గతేడాది ధర తగ్గడంతో..

ప్రతి సీజనులో సుమారు 40 వేల ఎకరాల్లో జొన్నలను రైతులు సాగు చేసేవారు. గత సంవత్సరం ధర తగ్గించడంతో ఈసారి జొన్నలకు బదులు ప్రత్యామ్నాయ పంటలను సాగు చేశారు. గతంలో కంటే 16 వేల ఎకరాల సాగు విస్తీర్ణం తగ్గడంతో సాగైన 24 వేల ఎకరాల పంటకు డిమాండ్ ఏర్పడాల్సి ఉంది. పంట సీజన్ మొదట్లో సీడ్ వ్యాపారులు మాత్రం ఇందుకు విరుద్ధంగా ధరను తగ్గించేశారు. ఎర్రజొన్నలను క్వింటాలుకు రూ. 3,500ల నుంచి రూ. 3,700ల వరకు కొనుగోలు చేయడానికి ఒప్పందాలను కుదుర్చుకున్నారు. తెల్ల జొన్నలకు కొంత ఎక్కువ ధర చెల్లించాల్సి ఉండగా ఇందుకు భిన్నంగా ధర తగ్గించారు. ముళ్ల జొన్నలకు మాత్రం ఎప్పటిలా ధర ఎక్కువ నిర్ణయించారు. నిన్న మొన్నటి వరకు ముళ్ల జొన్నలకు క్వింటాలుకు రూ. 4 వేలు చెల్లించడానికి ఒప్పందాలు చేసుకున్న వ్యాపారులు ఇప్పుడు ఏకంగా క్వింటాలుకు రూ. 5 వేలకు ధర పెంచారు.

జొన్నల సాగు విస్తీర్ణం తగ్గడం, ఉత్తరాది రాష్ట్రాలలో గడ్డి విత్తనాలకు డిమాండ్ పెరగడంతోనే సీడ్ వ్యాపారులు ధర పెంచుతూ కొనుగోళ్ల కోసం ఒప్పందాలను కుదుర్చుకుంటున్నారనే ప్రచారం జరుగుతుంది. జొన్నల కోతలు ఇప్పుడు ఇప్పుడే మొదలైతుండటంతో ముందు ముందు ధర మరింత పెరుగవచ్చనే భావన రైతుల్లో వ్యక్తమైతుంది. ఇదిలా ఉండగా తక్కువ ధరకు ఒప్పందాలు కుదుర్చుకున్న రైతులు ఆదాయం కోల్పోనుండగా వారికి ఎక్కువ ధర చెల్లించడానికి వ్యాపారులు అంగీకరిస్తారో లేదో వేచి చూడాల్సి ఉంది.

బతికిన మొక్కలెన్ని?



మోస్రా అటవీ ప్రాంతంలో నాటిన మొక్కలను పరిశీలిస్తున్న ఏజీఐ అధికారులు, జిల్లా సిబ్బంది

- జిల్లాలో ఏజీఐ అధికారుల తనిఖీలు
- మూడేళ్లలో నాటిన హరితహారం మొక్కలపై ఆరా
- ఏడు మండలాల్లో కొనసాగుతున్న క్షేత్రస్థాయి పరిశీలన
- కాగ్‌కు రిపోర్ట్ సమర్పించనున్న ఏజీఐ అధికారులు

ఇందూరు(నిజామాబాద్ అర్బన్): జిల్లాలో హరిత హారం కింద నాటిన మొక్కలపై ఆడిట్ జరుగుతోంది. గత మూడేళ్లలో నాటిన మొక్కల లెక్కలు తేల్చేందుకు ఆడిటర్ జనరల్ ఆఫ్ ఇండియా(ఏజీఐ) అధికారులు తనిఖీలు చేపడుతున్నారు. మూడేళ్లలో నాటిన మొక్కలెన్ని..? అందులో బతికినవి ఎన్ని..? ఖర్చు చేసిన నిధులెన్ని..? అనే దానిపై ఆరా తీస్తున్నారు. నర్సరీలను సైతం సందర్శించి పరిశీలిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ అధికారుల రాకతో సంబంధిత అధికారుల్లో కొంత భయం నెలకొంది. ఫిబ్రవరి మొదటి వారంలో ఇద్దరు ఏజీఐ అధికారులు హైదరాబాద్ నుంచి జిల్లాకు వచ్చారు. మొక్కలను పరిశీలించేందుకు జిల్లాలో ఆర్మూర్, మాక్లూర్, నిజామాబాద్, మోస్రా, నవీపేట్, భీమ్‌గల్, సిరికొండ కలిపి మొత్తం ఏడు మండలాలను ఎంపిక చేశారు. నిజామాబాద్, మోస్రా మండలాల్లో తనిఖీలు పూర్తి కాగా, ప్రస్తుతం భీమ్‌గల్‌లో పర్యటిస్తున్నారు. 2018–19 నుంచి 2021–22 వరకు జిల్లాలో నాటిన మొక్కలను పరిశీలిస్తున్నారు. రోడ్లకు ఇరువైపులా, అడవుల్లో నాటిన మొక్కలను సైతం తనిఖీ చేస్తున్నారు. అధికారులు చూపుతున్న లెక్కలు సరైనవో కాదో తేల్చేందుకు రాష్ట్రంలో ఇప్పటికే పలు జిల్లాల్లో ఏజీఐ అధికారులు తనిఖీలు చేపడుతుండగా, నిజామాబాద్ జిల్లాలో కూడా తనిఖీలు జరుగుతున్నాయి.

ఆరేళ్లలో అరవై తొమ్మిది శాతం

గ్రామీణాభివృద్ధి శాఖ జిల్లాలో నాటిన మొక్కలనే కీలకంగా చేసుకుని ఏజీఐ అధికారులు తనిఖీలు చేపడుతున్నారు. 2016–17 నుంచి 2021–22 వరకు గత ఆరేళ్లలో 3.82కోట్లకు పైగా మొక్కలను నాటినట్లు గ్రామీణాభివృద్ధి శాఖ లెక్కలు చెబుతున్నాయి. ఇందులో 2,66,50,422 మొక్కలు(69.76శాతం) మొక్కలు మనుగడలో ఉన్నాయని చూపుతున్నారు. కాగా మొక్కల పెంపకం, నాటిన వాటికి నిర్వహణకు చేసిన ఖర్చు రూ. కోట్లలోనే ఉంది. అయితే, కాగితాల్లోని మొక్కల లెక్కలు, ఖర్చుల అంకెలు సరైనవో కాదో ఏజీఐ అధికారులు కాగ్‌కు ఇచ్చే నివేదికతో తేలిపోనుంది.

అయితే, ఈనెల 20 వరకు మిగిలిన నాలుగు మండలాల్లో పర్యటించనున్నారు. జిల్లాలో తనిఖీలు పూర్తయిన అనంతరం రిపోర్ట్‌ను కాగ్‌కు సమర్పించనున్నారు. ఆ రిపోర్టు ఆధారంగా జిల్లాలో హరితహారం తీరు తేటతెల్లం కానుంది.

ఏడాది వారీగా మొక్కల లెక్కలు

సంవత్సరం	నాటినవి	బతికినవి	శాతం
2016-17	69,17,303	42,80,088	61.88
2017-18	67,38,277	33,75,186	50.09
2018-19	91,44,764	47,58,151	52.03
2019-20	1,01,24,519	90,29,283	89.18
2020-21	29,45,246	28,94,002	98.26
2021-22	23,30,748	23,13,712	99.27
మొత్తం	3,82,00,857	2,66,50,422	69.76

శ్రీవారికి చక్రస్నానం

బీర్కూర్ మండలం తిమ్మాపూర్‌లోని తెలంగాణ తిరుమల దేవస్థానంలో బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం విశేష పూజలు చేశారు. శ్రీవారికి చక్రస్నానం చేయించారు. మాడ వీధుల్లో కల్పవృక్ష వాహనంపై స్వామి వారిని ఊరేగించారు. కార్యక్రమాలలో స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి దంపతులు పాల్గొన్నారు.

– నస్రుల్లాబాద్



స్వామివారికి చక్రస్నానం చేయిస్తున్న వేద పండితులు, స్పీకర్ దంపతులు

అడవుల రక్షణకు ప్రత్యేక చర్యలు

సిరికొండ : జిల్లాలో అడవుల రక్షణకు ప్రత్యే క చర్యలు తీసుకుంటున్నట్లు అటవీ శాఖ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ (సీసీఎఫ్) శరవణన్ తెలిపారు. మండలంలోని రేంజ్ పరిధిలోని జినిగ్యాల, తాటిపల్లి అటవీ ప్రాంతంలో 7 కిలోమీటర్ల మేర కాలినడకన పర్యటిస్తూ అటవీ ప్రాంతాన్ని సీసీఎఫ్ శనివారం పరిశీలించారు. చెక్‌డ్యాంలను తనిఖీ చేశారు. అనంతరం మాట్లాడుతూ వన్యప్రాణుల దాహార్తి తీర్చేందుకు సోలార్ బోర్‌వెల్ ఏర్పాటు చేయిస్తామన్నారు. అటవీ జంతువుల దాడిలో పశువులు చనిపోతే నష్టపరిహారం ఇస్తామన్నారు. అడవుల్లో వన్యప్రాణుల సంఖ్య పెరిగిందన్నారు. సిరికొండలో 532 సర్వే.నంలో డీజీపీఎస్ సర్వే పూర్తయిందని రెవెన్యూ,అటవీ శాఖల మధ్య సమస్యను కొలిక్కి తెస్తామని సీసీఎఫ్ తెలిపారు. డీఎఫ్‌వో వికాస్‌మీనా, ఆర్మూర్ ఎఫ్‌డీవో భవానీ శంకర్, సిరికొండ, కమ్మర్‌పల్లి రేంజర్లు ఎంపీనాయక్, రవీందర్ ఉన్నారు.



అటవీ ప్రాంతంలో పర్యటిస్తున్న సీసీఎఫ్ శరవణన్

క్లుప్తంగా

కొత్త జీవితంలోకి రావాలి



ఇందూరు: సెక్స్‌ వర్కర్ల సమాజంలో వివక్షకు గురవుతున్నారని, అలాంటి వృత్తిని వదిలి జన జీవన శైలీలో కలిసిపోయి కొత్త జీవితాన్ని ప్రారంభించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి పద్మావతి అన్నారు. శుక్రవారం నగరంలోని స్నేహ సొసైటీలో అంతర్జాతీయ మహిళా సెక్స్‌ వర్కర్ల హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వృత్తిని వదిలి చిన్న వ్యాపారాలు చేయాలని, న్యాయ సహాయం అందించడానికి కృషి చేస్తామన్నారు. జెడ్పీ చైర్మన్‌ దాదన్నగారి విఠల్‌రావు మాట్లాడుతూ.. ప్రభుత్వం నుంచి పథకాలు అందేలా చూస్తామన్నారు. ఐసీడీఎస్‌ పీడీ సుధారాణి, స్నేహ సొసైటీ కార్యదర్శి సిద్దయ్య, ప్రాజెక్టు మేనేజర్‌ మోహిజ్‌ అహ్మద్‌, ప్రిన్సిపల్‌ జ్యోతి, ప్రవీణ్‌రెడ్డి, లావణ్య, పాల్గొన్నారు.

7లోగా రీ కౌంటింగ్‌, రీ వాల్యుయేషన్‌ ఫీజు చెల్లించాలి

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పీజీ రెండు, నాలుగో సెమిస్టర్‌ రెగ్యులర్‌ పరీక్షల రీ వాల్యుయేషన్‌, రీ కౌంటింగ్‌ ఫీజును మార్చి 7లోగా చెల్లించాలని కంట్రోలర్‌ అరుణ ఒక ప్రకటనలో తెలిపారు. ఇదే చివరి అవకాశమన్నారు. ఒక్కో పేపర్‌ రీవాల్యుయేషన్‌కు రూ.500, రీ కౌంటింగ్‌కు రూ.300, దరఖాస్తు ఫారానికి రూ.25 చెల్లించాల్సి ఉంటుందన్నారు.

ఎక్సైజ్‌ హెడ్‌కానిస్టేబుల్‌ అదనపు పోస్టులకు కృషి

ఖలీల్‌వాడి: ఎక్సైజ్‌ కానిస్టేబుళ్లకు 30 ఏళ్లయిన ప్రమోషన్‌ లేక అలాగే విరమణ చేస్తున్నారని రాష్ట్ర ఎక్సైజ్‌ హెడ్‌ కానిస్టేబుల్స్‌ అండ్‌ కానిస్టేబుల్స్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు రాజిరెడ్డి అన్నారు. శుక్రవారం నగరంలోని సుభాష్‌నగర్‌లోని ప్రొహిబిషన్‌ ఎక్సైజ్‌ హెడ్‌ కానిస్టేబుల్స్‌ అండ్‌ కానిస్టేబుల్స్‌ అసోసియేషన్‌ భవనంలో క్యాలెండర్‌, డైరీ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి డిప్యూటీ కమిషనర్‌ దశరథం, జిల్లా ఎక్సైజ్‌ సూపరింటెండెంట్‌ మల్లారెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు రాజిరెడ్డి హాజరై మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా 200 అదనపు కానిస్టేబుల్‌ పోస్టులు ఏర్పాటు చేయాలని విన్నవించినట్లు తెలిపారు. బదిలీల ప్రక్రియ చేపట్టే అవకాశాలు ఉన్నాయన్నారు. ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు రవికుమార్‌, చంద్రమోహన్‌, భోజన్న, ఉత్తమ్‌, శ్రీను ప్రసాద్‌,వివిధ జిల్లాల అధ్యక్షులు పాల్గొన్నారు.

వర్సిటీ చెస్‌ క్రీడాకారుల ఎంపిక



చెస్‌ ఆడుతున్న క్రీడాకారులు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ అంతర కళాశాలల చదరంగ (చెస్‌) ఎంపిక పోటీలను శుక్రవారం నిర్వహించినట్లు వర్సిటీ క్రీడావిభాగం డైరెక్టర్‌ సంపత్‌ తెలిపారు. ఆర్ట్స్‌ అండ్‌ సైన్స్‌ కాలేజీ సెమినార్‌ హాల్‌లో అనుబంధ కళాశాలల నుంచి వచ్చిన క్రీడాకారులు చెస్‌ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్‌ ఆరతి మాట్లాడుతూ.. విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు ముఖ్యమేనని పేర్కొన్నారు. ఈ పోటీల్లో బి శివసాయి (కేర్‌డిగ్రీ కాలేజీ), కె గోపాల్‌నాయక్‌ (సౌత్‌క్యాంపస్‌, భిక్కనూర్‌), ఎస్‌ రాజ్‌కుమార్‌, బిరాకేష్‌ (తెయూ మెయిన్‌ క్యాంపస్‌) యూనివర్సిటీ జట్టుకు ఎంపికైనట్లు సంపత్‌ తెలిపారు. ఎంపికైన వారు ఈ నెల 10 నుంచి 12వరకు చెన్నైలో జరిగే సౌత్‌జోన్‌ ఇంటర్‌ యూనివర్సిటీస్‌ చెస్‌ (మెన్‌) టోర్నమెంట్‌లో పాల్గొంటారని పేర్కొన్నారు. విజేతలకు ప్రిన్సిపాల్‌ బహుమతులు అందజేశారు. ఫిజికల్‌ డైరెక్టర్లు బీఆర్‌ నేత, రమేష్‌, బాలమణి, అనిల్‌కుమార్‌ పాల్గొన్నారు.



హ్యాండ్‌బాల్‌ జట్టుకు ఎంపికైన క్రీడాకారులు

హ్యాండ్‌బాల్‌ ఉమ్మడి జిల్లా జట్టు..

ఆర్మూర్‌టౌన్‌: పట్టణంలోని పిప్రిరోడ్డులో గల గురుకుల పాఠశాలలో బాలుర సబ్‌ జూనియర్‌ హ్యాండ్‌ బాల్‌ జిల్లా జట్టుకు శుక్రవారం క్రీడకారులను ఎంపిక చేసినట్లు జిల్లా బాల్‌ బ్యాడ్మింటన్‌ హడక్‌ కమిటీ చైర్మన్‌ గంగా మోహన్‌ చక్రు తెలిపారు. హ్యాండ్‌ బాల్‌ రాష్ట్ర సంఘం ఆదేశాల మేరకు జట్టును ఖరారు చేసినట్లు పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లాలోని వివిధ పాఠశాలల నుంచి 100 మంది క్రీడాకారులు పాల్గొనగా అందులో ప్రతిభ కనబరిచిన 20మందిని ఎంపిక చేశామన్నారు. వీరికి ఉప్పలవాయి టీఎస్‌డబ్ల్యూఆర్‌ఎస్‌ స్కూల్‌లో ఈనెల 5 నుంచి 10 వరకు శిక్షణ శిబిరం నిర్వహిస్తామని చెప్పారు. శిబిరంలో ప్రతిభ కనబరిచిన వారిని జిల్లా జట్టుకు ఎంపిక చేస్తామన్నారు. పింజ సురేందర్‌, గటడి రాజేష్‌, టి విద్యాసాగర్‌ రెడ్డి ప్రిన్సిపాల్‌ దుర్గారెడ్డి, ఉపాధ్యాయులు శ్రీకాంత్‌, ప్రవీణ్‌, రాజేందర్‌ పాల్గొన్నారు.

5న ఖేలో ఇండియా పోటీలకు జట్టు ఎంపిక

నిజామాబాద్‌నాగారం: నిజామాబాద్‌ జిల్లా సైక్లింగ్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో ఈ నెల 5న బాలికలు, ఉమెన్‌ విభాగంలో ఎంపికలు నిర్వహిస్తున్నట్లు జిల్లా కార్యదర్శి విజయకాంత్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని కంఠేశ్వర్‌ బైపాస్‌ రోడ్డులో అండర్‌-14, 16, 18, మహిళల విభాగంలో పోటీలు ఉంటాయన్నారు. ఎంపికైన వారిని ఈ నెల 13 నుంచి 19వరకు హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీలో జరిగే పోటీలకు పంపిస్తామని తెలిపారు. వివరాలకు 9912883331 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

ఆలయాల అభివృద్ధికి ప్రాధాన్యం

స్పీకర్‌ పోచారం శ్రీనివాస్‌రెడ్డి



శిలాఫలకం ఆవిష్కరిస్తున్న స్పీకర్‌ పోచారం

రుద్రూర్‌: బాన్సువాడ నియోజకవర్గంలో దేవాలయాల అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తున్నామని స్పీకర్‌ పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. రుద్రూర్‌లో నూతనంగా నిర్మించిన శ్రీ విఠలేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం ఆయన పూజలు చేశారు. ఆలయ శిలాఫలకం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్‌ సహకారంతో నియోజకవర్గ అభివృద్ధితో పాటు ఆలయాలకు ప్రాధాన్యం ఇస్తున్నామని పేర్కొన్నారు. రుద్రూర్‌లో పెద్దమ్మ ఆలయానికి రూ.20లక్షలు, గణపతి ఆలయానికి రూ.10లక్షలు, ఎల్లమ్మ గుడికి రూ.10 నిధులు, విఠలేశ్వర ఆలయ ప్రహరీకి రూ.10లక్షలు మంజూరు చేశామని వివరించారు. హన్మాన్‌ మాల ధారణ స్వాముల సన్నిదానం నిర్మాణానికి రూ.10లక్షలు మంజూరు చేస్తామన్నారు. ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు చిదుర వీరేశం, గెంటీల సాయిలు, ఎంపీపీ సుజాతనాగేందర్‌, జెడ్పీటీసీ నరోజి గంగారాం, విండో చైర్మన్‌ సంజీవరెడ్డి, పత్తి రాము, పత్తి లక్ష్మణ్‌ పాల్గొన్నారు.

రోగుల సమస్యలు పరిష్కరించేందుకు 'పేషెంట్స్‌ ఫోరం'



మాట్లాడుతున్న డాక్టర్‌ సుధాకర్‌రావు

నిజామాబాద్‌ సిటీ: గుండె ఆపరేషన్‌ తర్వాత రోగులు తమ అనుభవాలను, భయాలను వైద్య నిపుణులతో పంచుకొని వారి సమస్యలను పరిష్కరించడానికే పేషెంట్స్‌ ఫోరం కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు మల్లారెడ్డి నారాయణ మల్టీస్పెషాలిటీ హాస్పిటల్స్‌ సీఈవో, సీనియర్‌ కన్సల్టెంట్‌ చీఫ్‌ కార్డియో థొరాసిక్‌ సర్జన్‌ సుధాకర్‌రావు మాదాసు అన్నారు. గుండె ఆపరేషన్లు చేయించుకున్న వారితో శుక్రవారం నగరంలోని హోటల్‌ నిఖిల్‌సాయిలో పేషెంట్స్‌ ఫోరం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఇటీవల దేశంలో గుండె జబ్బుల ప్రమాదం తీవ్రంగా పెరుగుతుందన్నారు. పనిఒత్తిళ్లు ఎదుర్కొంటున్న వారు గుండె జబ్బులకు గురి అవుతున్నారని చెప్పారు. నిజామాబాద్‌, బోధన్‌, బాన్సువాడ, ఆర్మూర్‌ ప్రాంతాలకు చెందిన అనేక మందికి గుండె ఆపరేషన్లు చేశామన్నారు. ఆపరేషన్‌ అనంతరం వారికి ఇంక ఏమైనా సమస్యలు ఉన్నాయా తెలుసుకుని వారిలో సాధికారతను పెంపొందించేందుకు ఈ సమ్మేళనం చేశామన్నారు. ఆస్పత్రి మరో సీఈవో మహేంద్ర పాలా మాట్లాడుతూ గుండెజబ్బుల గురించి అవగాహన పెంపొందించుకోవాలన్నారు.

రూ.రెండు లక్షల రుణమాఫీ చేస్తాం



భీమ్‌గల్‌లో పర్యటిస్తున్న డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి, తదితరులు

భీమ్‌గల్‌: కాంగ్రెస్‌ అధికారంలోకి రాగానే ఏక కాలంలో రూ.రెండు లక్షల రుణమాఫీ చేస్తామని కాంగ్రెస్‌ జిల్లా అధ్యక్షుడు మానాల మోహన్‌ రెడ్డి అన్నారు. హాథ్‌ సే హాథ్‌ జోడో యాత్ర కార్యక్రమాన్ని కాంగ్రెస్‌ మండల అధ్యక్షుడు బొదిరె స్వామి ఆధ్వర్యంలో శుక్రవారం భీమ్‌గల్‌లో నిర్వహించారు. ఈ కాక్యక్రమంలో పాల్గొన్న మానాల మోహన్‌రెడ్డి మాట్లాడారు. రాహుల్‌ గాంధీ సందేశాన్ని ప్రజలకు వివరించారు. తాము గెలిస్తే అసైన్డ్‌, పోడు భూములకు యాజమాన్య హక్కులు కల్పిస్తామని, ధరణి పోర్టల్‌ను రద్దు చేస్తామన్నారు. నియోజకవర్గంలో మంత్రి ప్రశాంత్‌ రెడ్డి కమీషన్‌ల కోసం రోడ్లు వేయిస్తున్నారని ఆరోపించారు. రాబోయే కాలంలో మంత్రి అక్రమాలను బయట పెడతామన్నారు. జెజె నర్సయ్య, నాగేంద్ర, వాక మహేష్‌ తదితరులు పాల్గొన్నారు.

10 వరకు ఓపెన్‌ యూనివర్సిటీ పీజీ ప్రవేశాలు

నిజామాబాద్‌అర్బన్‌: డాక్టర్‌ బీఆర్‌ అంబేడ్కర్‌ ఓపెన్‌ యూనివర్సిటీ పీజీ డిప్లొమ కోర్సులో ప్రవేశానికి ఈ నెల 10 చివరి తేది అని గిరిరాజ్‌ కళాశాల ప్రిన్సిపాల్‌ రామ్మోహన్‌ రెడ్డి, కేంద్రం కోఆర్డినేటర్‌ రంజిత ఒక ప్రకటనలో తెలిపారు. ఓపెన్‌ యూనివర్సిటీలో కొత్తగా పీజీ డిప్లొమ కోర్సులను ప్రవేశపెట్టినట్లు పేర్కొన్నారు. వివరాలకు 7382929510, 7382929580 నంబర్లను సంప్రదించాలన్నారు.

9,10 తేదీల్లో బీఈడీ ప్రాక్టికల్‌ పరీక్షలు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని బీఈడీ మూడో సెమిస్టర్‌ ప్రాక్టికల్‌ పరీక్షలు (ఫేజ్‌-2) ఈ నెల 9, 10 తేదీల్లో నిర్వహించనున్నట్లు కంట్రోలర్‌ ఎం అరుణ ప్రకటనలో తెలిపారు. సంబంధిత కళాశాలల విద్యార్థులు ఈ విషయాన్ని గమనించాలని సూచించారు.

జానపద కళాకారుడు రాజయ్యకు అవార్డు

సదాశివనగర్‌: మండలంలోని కుప్రియాల్‌ గ్రామానికి చెందిన జానపద కళాకారుడు రెడ్డి రాజయ్య గోవాలో ఇంటర్నేషనల్‌ అవార్డు అందుకున్నారు. మూడు దశాబ్దాలుగా జానపద కళా రంగానికి చేస్తున్న సేవలకు గుర్తింపుగా తనకు ఈ అవార్డు దక్కిందన్నారు. కన్నతల్లి ఫౌండేషన్‌ ఆధ్వర్యంలో అవార్డు పొందినట్లు పేర్కొన్నారు.

పోలీస్‌ కుటుంబాలకు చెక్కుల అందజేత



చెక్కులను అందిస్తున్న సీపీ నాగరాజు

ఖలీల్‌వాడి: మృతి చెందిన పోలీస్‌ సిబ్బంది కుటుంబాలకు సీపీ కెఆర్‌ నాగరాజు శుక్రవారం చెక్‌లను పంపిణీ చేశారు. జిల్లా కేంద్రంలోని పోలీస్‌కమిషనర్‌ కార్యాలయంలో ఏఎస్సై ఎస్‌కె బాషా, కానిస్టేబుల్‌ శివచరణ్‌ కుటుంబసభ్యులకు చెక్‌లను అందజేశారు. సెప్టెంబర్‌ 9న రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సిరికొండ ఏఎస్సై బాషా కుటుంబసభ్యులకు పోలీస్‌ భద్రతా స్కీం రూపంలో రూ.16 లక్షలు చెక్కును, అనారోగ్యంతో మృతి చెందిన కానిస్టేబుల్‌ శివచరణ్‌కు రూ.నాలుగు లక్షల చెక్కును అందజేశారు. అదనపు పోలీస్‌ కమిషనర్‌ (ఏఆర్‌) గిరిరాజ్‌, పోలీస్‌ అసోసియేషన్‌ అధ్యక్షులు షకీల్‌ పాషా తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న పోలీస్‌ క్రీడలు



క్రికెట్‌లో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన జట్లు

ఖలీల్‌వాడి: పోలీస్‌ శాఖ ఆధ్వర్యంలో వార్షిక స్పోర్ట్స్‌ అండ్‌ గేమ్స్‌ మీట్‌లో భాగంగా పోలీస్‌ హెడ్‌ క్వార్టర్స్‌ గ్రౌండ్లో శుక్రవారం ముడో రోజు క్రీడలు నిర్వహించినట్లు సీపీ నాగరాజు తెలిపారు. క్రికెట్‌లో పోలీస్‌ హెడ్‌ కార్టర్స్‌ జట్టు గెలుపొందగా, రెండో స్థానంలో ఆర్మూర్‌ డివిజన్‌ విభాగం జట్టు నిలిచాయి. వాలీబాల్‌లో హోమ్‌ గార్డ్స్‌ విభాగం జట్టు, కబడ్డీలో పోలీస్‌ హెడ్‌ కార్టర్స్‌ విభాగం గెలుపొందినట్లు తెలిపారు. శనివారం మిగిలిన అన్ని క్రీడలు యథావిధిగా కొనసాగుతాయని చెప్పారు.

నీటి గుంతలో పడ్డ వ్యక్తిని కాపాడిన కానిస్టేబుల్‌



బాధితుడిని పరిశీలిస్తున్న ఎస్సై రవీందర్‌

రుద్రూర్‌: రుద్రూర్‌ అంగడి బజార్‌ సమీపంలో శుక్రవారం ఓ వ్యక్తి ఒక్కసారిగా గిలగిల కొట్టుకుంటూ ప్రధాన రహదారి సమీపంలోని నీటి గుంతలో పడిపోయాడు. అదే సమయంలో బోధన్‌ నుంచి రుద్రూర్‌కు వస్తున్న కానిస్టేబుల్‌ శ్రీనివాస్‌ వెంటనే గుంతలో దిగి బయటకు తీశాడు. బాధితుడు మింగిన నీటిని కడుపుపై నొక్కి బయటకు తీసేశాడు. ఘటనా స్థలికి ఎస్సై రవీందర్‌ వచ్చి వివరాలు తెలుసుకున్నారు. బాధితుడిని బోధన్‌ వాసిగా గుర్తించారు. స్పృహ రాగానే ఇంటికి పంపించారు. బాధితుడికి కల్లు తాగే అలవాటు ఉందని, అలాగే మూర్ఛ వ్యాధి ఉండవచ్చునని భావిస్తున్నారు.

ఇరువర్గాల ఘర్షణ: పలువురిపై కేసు

నవీపేట: మండలంలోని ధర్మారం గ్రామంలో శుక్రవారం జరిగిన ఇరువర్గాల ఘర్షణలో పలువురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజారెడ్డి తెలిపారు. గ్రామానికి చెందిన ముద్దంగుల లక్ష్మి, సూర నర్సయ్య పాత కక్షలను దృష్టిలో ఉంచుకుని పరస్పర దాడులకు పాల్పడ్డారని పేర్కొన్నారు. ఇరువురి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

క్రైం కార్నర్‌

వేర్వేరు కారణాలతో ముగ్గురి ఆత్మహత్య



విఠల్‌ మృతదేహం



శ్రీనివాస్‌ మృతదేహం

నిజామాబాద్‌ సిటీ: నిజామాబాద్‌ రూరల్‌ మండలం భాగ్యనగర్‌(ఖానాపూర్‌)కు చెందిన విఠల్‌ (24) అనే యువకుడు మద్యానికి బానిసై జీవితంపై విరక్తి చెందిన ఆత్మహత్య చేసుకున్నట్లు రూరల్‌ ఎస్సై లింబాద్రి తెలిపారు. విఠల్‌ పనిచేయకుండా మద్యానికి బానిసై జీవితంపై విరక్తి చెందాడు. గురువారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. విఠల్‌ తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

కాలేపల్లి క్యాంప్‌లో..

రూరల్‌ మండలం కాలేపల్లి క్యాంప్‌లో మద్దిపూడి శ్రీనివాస్‌(30) కొన్నిరోజులుగా మద్యానికి బానిసయ్యాడు. శ్రీనివాస్‌ ఎటువంటి పనిచేయకుండా ఉంటూ మద్యానికి డబ్బులు లేక జీవితంపై విరక్తి చెందాడు. గురువారం మధ్యాహ్నం ఎలుకల మందు తాగి వాంతులు చేసుకోగా అతని భార్య స్నేహ చూసి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించింది. అక్కడ చికిత్స పొందుతూ అర్ధరాత్రి మృతిచెందాడు. స్నేహ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

మనస్తాపంతో ఒకరు..

ఖలీల్‌వాడి: నగరంలోని శ్రీనివాస్‌ నగర్‌ కెనాల్‌ కట్ట ప్రాంతానికి చెందిన జానకంపేట అనిల్‌ (40) గురువారం రాత్రి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై సాయినాథ్‌ తెలిపారు. అనిల్‌ భార్య సవిత మూడేళ్ల క్రితం ఆత్మహత్య చేసుకుంది. అప్పటి నుంచి అనిల్‌ మనోవేదనతో తాగుడుకు బానిసయ్యాడు. ఈ క్రమంలో ఇంట్లో ఉరి వేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. మృతుడి తల్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

ఏడు ట్రాన్స్‌ఫార్మర్ల ధ్వంసం

- కాపర్‌ వైర్‌, ఆయిల్‌ చోరీ

పిట్లం(జుక్కల్‌): మండలంలోని మద్దెల్‌చెరు శివారు పొలాల్లోని ఆరు ట్రాన్స్‌ఫార్మర్లను, చిన్నకోడపల్‌ గ్రామ శివారులో ఒక ట్రాన్స్‌ఫార్మర్‌ను గురువారం రాత్రి గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేశారు. అనంతరం ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి ఆయిల్‌, రాగి తీగను ఎత్తుకెళ్లారు. శుక్రవారం విద్యుత్‌ శాఖ అధికారులు ధ్వంసమైన ట్రాన్స్‌ఫార్మర్లను పరిశీలించారు. వాటి విలువ సుమారు రూ.3.50 లక్షలు ఉంటుందని, ఈ విషయంపై పోలీస్‌ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని విద్యుత్‌ శాఖ అధికారులు తెలిపారు.

దాడి కేసులో ఇద్దరి అరెస్టు

భిక్కనూరు: భిక్కనూర్‌లో మాజీ సర్పంచ్‌ సత్యారెడ్డిపై దాడి కేసులో ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్సై ఆనంద్‌గౌడ్‌ శుక్రవారం రాత్రి తెలిపారు. మండల కేంద్రానికి చెందిన పెద్దబచ్చగారి శ్రీధర్‌రెడ్డితో పాటు ఆయన సోదరుడు జ్ఞాన ప్రకాశ్‌రెడ్డిను అరెస్టు చేశామన్నారు.

పెళ్లింట విషాదం

- పెళ్లయిన మూడో రోజు వధువు తండ్రి మృతి
- రెండో రోజు వరుడి చిన్న నాన్న ఆత్మహత్య

ఎల్లారెడ్డి రూరల్‌/లింగంపేట: పెళ్లయిన రెండ్రోజులకే వధూవరుల కుటుంబాల్లో విషాదం నెలకొంది. వధువు తండ్రి గుండె పోటుతో మృతి చెందగా, వరుడి చిన్న నాన్న చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎల్లారెడ్డి మండలం తిమ్మారెడ్డి గ్రామానికి చెందిన పుట్టి కిష్టయ్య కూతురు స్వాతికి, లింగంపేట మండలం పోతాయిపల్లి గ్రామానికి చెందిన భువనగిరి గణేశ్‌తో ఈనెల 1న వివాహం జరిగింది. కాగా పెళ్లి కుమారుడి చిన్న నాన్న భువనగిరి(పెద్దబోయిన) లస్మయ్య(55) కుటుంబ కలహాలతో మరుసటి రోజు ఈనెల 2న గ్రామ శివారులోని చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. లస్మయ్య కుటుంబంతో కలిసి బతుకు దెరువు కోసం హైదరాబాదు వెళ్లాడు. అక్కడ కూలీ పనులు చేసుకుంటున్నారు. లస్మయ్య అన్న రాములు కొడుకు గణేశ్‌ పెళ్లి ఉండడంతో నాలుగు రోజుల క్రితం స్వగ్రామానికి వచ్చారు. 1వ తేదీన పెళ్లి జరిగింది. 2న భార్య బాబమ్మ, పిల్లలు లస్మయ్యను మద్యం తాగవద్దన్నారు. ఈ విషయంలో వారి మధ్య గొడవ జరిగింది. దీంతో చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. మూడో రోజు పెళ్లి కూతురి తండ్రి కిష్టయ్య(50) శుక్రవారం గుండెపోటుతో మరణించాడు. ఇద్దరి మృతదేహాలు ఒకే రోజు పోస్టుమార్టం నిమిత్తం రావడంతో ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలో బంధువుల రోదనలు మిన్నంటాయి. లస్మయ్య ఆత్మహత్యపై ఆయన భార్య బాబమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై శంకర్‌ తెలిపారు.

చికిత్స పొందుతూ మృతి

ఖలీల్‌వాడి: నగరంలోని సారంగపూర్‌ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ రవీందర్‌(42) చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై సాయి కుమార్‌ గౌడ్‌ తెలిపారు. బుధవారం రవీందర్‌ నిజామాబాద్‌ నుంచి సారంగపూర్‌కు యాక్టివాపై వెళ్తుండగా బోలెరో వాహనం ఢీకొంది. మృతుడి సోదరుడు చౌహాన్‌ దేవిరామ్‌ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఇంజిన్‌ ఆయిల్‌ తాగిన యువకుడు..

మాక్లూర్‌: మద్యం తాగిన మత్తులో ఇంజిన్‌ ఆయిల్‌ తాగి, ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న డి వంశీ(21) శుక్రవారం మృతి చెందినట్లు ఎస్సై యాదగిరిగౌడ్‌ తెలిపారు. మండలంలోని గంగరమంద గ్రామానికి చెందిన వంశీ మద్యానికి బానిసై జులాయిగా తిరిగేవాడు. ఈ క్రమంలో గురువారం మద్యం మత్తులో సమీపంలోని రైతు ట్రాక్టర్‌కు సంబంధించిన ఇంజిన్‌ ఆయిల్‌ తాగాడు. వెంటనే వాంతులు చేసుకోవటంతో కుటుంబ సభ్యులు జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. మృతుడి తండ్రి మోహన్‌ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

అమ్దాపూర్‌ శివారులో ఒకరి హత్య



ఘటన స్థలంలో మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

బోధన్‌రూరల్‌: మండలంలోని అమ్దాపూర్‌ శివారులో ఊట్‌పల్లి గ్రామానికి చెందిన జాడల మదారి(56) అనే వ్యక్తి హత్యకు గురైనట్లు బోధన్‌ రూరల్‌ ఎస్సై సందీప్‌ శుక్రవారం తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. ఊట్‌పల్లికి చెందిన జాడల మదారి బెల్లాల్‌ గ్రామంలోని కల్లుబట్టిలో కూలీ పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. గురువారం ఉదయం పని కోసం ఇంటి నుంచి వెళ్లిన ఆయన రాత్రి వరకు తిరిగి రాలేదు. శుక్రవారం అమ్దాపూర్‌ శివారులోని ఖాళీ ప్రదేశంలో మృతదేహం, టీవీఎస్‌ ఎక్సెల్‌ వాహనం చూసిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సీఐ శ్రీనివాస్‌ రాజ్‌, ఎస్సై సందీప్‌ ఘటన స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు. మదారిని గుర్తు తెలియని వ్యక్తులు టవల్‌తో గొంతు బిగించి హత్య చేసినట్లు గుర్తించారు. మృతుడి బంధువు రాజయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గంజాయి విక్రయిస్తున్న ఇద్దరి అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

నిజామాబాద్‌సిటీ: నాందేడ్‌ నుంచి గంజాయి తీసుకువచ్చి విక్రయిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసినట్లు నిజామాబాద్‌ రూరల్‌ ఎస్సై లింబాద్రి శుక్రవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు.. నగరంలోని అసద్‌ బాబానగర్‌కు చెందిన అఫ్రోజ్‌ అలియాస్‌ అఫ్‌ నాందేడ్‌ నుంచి గంజాయి తీసుకువస్తూ నిజామాబాద్‌లో విక్రయిస్తుంటాడు. ఈ క్రమంలో అతనికి అసద్‌ బాబానగర్‌కు చెందిన యువకుడు సర్ఫరాజ్‌ఖాన్‌తో పరిచయం ఏర్పడింది. ఇద్దరు గంజాయి దందా చేయాలని నిర్ణయించారు. అఫ్‌ నాందేడ్‌ నుంచి తీసుకు వచ్చిన గంజాయిని రూ. 19వేలకు సర్ఫరాజ్‌కు విక్రయించాడు. అతను స్నేహితుడు షేక్‌ అవైస్‌తో కలిసి గంజాయిని చిన్న ప్యాకెట్లుగా తయారుచేసి నిజామాబాద్‌లో విక్రయించటం మొదలుపెట్టారు. ఈ క్రమంలో నగరంలోని చంద్రశేఖర్‌కాలనీలో ఇద్దరు యువకులు గంజాయి విక్రయిస్తారని పోలీసులు అందిన సమాచారం మేరకు సర్ఫరాజ్‌ఖాన్‌, షేక్‌ అవైస్‌లను పట్టుకుని అరెస్టు చేశారు. నిందితుల నుంచి 740 గ్రాముల గంజాయి, రెండు సెల్‌ఫోన్లు, ఒక ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

కుక్కల దాడిలో దూడ మృతి

సిరికొండ: మండలంలోని గడ్కోల్‌ గ్రామంలో కుక్కల దాడిలో గేదె దూడ శుక్రవారం మృతి చెందింది. గ్రామానికి చెందిన గాండ్ల బుచ్చన్న తన దూడను చెట్టు కింద కట్టి ఉంచాడు. నాలుగైదు కుక్కలు దూడపై దాడి చేసి గాయపర్చాయి. అదే సమయంలో అక్కడికి వచ్చిన బుచ్చన్న కుక్కలను తరిమేశాడు. చికిత్స చేయించే లోపే దూడ చనిపోయిందని బాధితుడు తెలిపాడు.

రోడ్డు ప్రమాదంలో దూడ..

రుద్రూర్‌: రుద్రూర్‌-అక్బర్‌నగర్‌ రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో దూడ మృతి చెందింది. వర్ని వైపు నుంచి వేగంగా వస్తున్న లారీ దూడను ఢీకొట్టి కొద్ది దూరం వరకు లాక్కెళ్లింది.

డ్రంకన్‌ డ్రైవ్‌ కేసులో ఒకరికి జైలు

ఖలీల్‌వాడి: మద్యం తాగి ఆటో నడిపిన ముఖ్దూమ్‌కు రెండు రోజుల జైలుశిక్ష విధిస్తూ నిజామాబాద్‌ జ్యూడిషియల్‌ సెకండ్‌ క్లాస్‌ మేజిస్ట్రేట్‌ సయ్యద్‌ ఖదీర్‌ శుక్రవారం తీర్పు చెప్పారు. కామారెడ్డి జిల్లా లింగంపేట్‌ మండలం బానాల గ్రామానికి చెందిన ముఖ్దూమ్‌ మద్యం తాగి ఆటో నడుపుతుండగా గురువారం నిజామాబాద్‌లో పోలీసులు పట్టుకున్నారు. శుక్రవారం కోర్టులో ప్రవేశపెట్టగా మేజిస్ట్రేట్‌ జైలు శిక్ష విధించారు.

బైకు చోరీ

లింగంపేట: మండలంలోని శెట్పల్లి గ్రామంలో పాపాగౌడ్‌ చెందిన హీరో హోండా ఫ్యాషన్‌ ప్లస్‌ బైక్‌ (ఏపీ29 బీసీ 1596) గురువారం రాత్రి పోయినట్లు పోలీసులు తెలిపారు. పాపాగౌడ్‌ గురువారం రాత్రి తన ఇంటి ముందు బైకు పెట్టి పడుకున్నాడు. శుక్రవారం ఉదయం లేచి చూసేసరికి బైకు కనిపించలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

చైన్‌ స్నాచర్‌ను పట్టుకున్న ప్రయాణికులు

బోధన్‌టౌన్‌: బోధన్‌ బస్టాండ్‌లో మహిళ మెడలోంచి పుస్తెల తాడును దొంగిలించి పారిపోతున్న వ్యక్తిని ప్రయాణికులు పట్టుకొని పోలీసులకు అప్పగించారు. వివరాలు.. బోధన్‌ మండలంలోని హంగర్గ గ్రామానికి చెందిన భూమిక తన భర్తతో సంగారెడ్డి వెళ్లడానికి గురువారం రాత్రి బస్టాండ్‌లో వేచి ఉంది. వెనక నుంచి వచ్చిన గుర్తు తెలియని వ్యక్తి ఆమె మెడలోంచి పుస్తెల తాడు లాక్కొని పారిపోతుండగా ఆమె అరవడంతో ప్రయాణికులు నిందితుడిని పట్టుకొని పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు బస్టాండ్‌కు చేరుకొని నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు.